TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 231 | గురువారం 13-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-




పేజి 2లో ▶

## మాజీ రాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ
# ఆవిష్కరించిన మోదీ

**'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్' పుస్తకావిష్కరణ**



న్యూఢిల్లీ, ఆగస్టు 12 భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు.

- సుదీర్ఘ అనుబంధం: కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని.
- విలువైన మార్గదర్శకత్వం: రాష్ట్రపతిగా కోవింద్ ఇచ్చిన మార్గదర్శకత్వం ఎంతో విలువైనది.
- ఒకే దేశం-ఒకే ఎన్నిక: ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో కోవింద్ గొప్ప కృషి: మోదీ.
- యువతకు సందేశం: యువత ఆయన జీవిత అనుభవాల నుండి నేర్చుకోవాలి.
- చిరస్మరణీయ వారసత్వం: ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యానికి చిరస్మరణీయ వారసత్వం.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు



2లో

# పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం..

**ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా : అమిత్ షా**



2లో

## సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకు?

**: స్పీకర్ అయ్యన్న**



- సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకు?: అయ్యన్న
- వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదు
- సభకు రాని వారికి జీతాలు ఎందుకు?
- 6 నెలలు సభకు రాకుంటే అనర్హత వేటుపై చర్చ
- దొంగ సంతకాలను అరికట్టేందుకు ఫేస్ రికగ్నిషన్
- హాజరుకాని ఎమ్మెల్యేలకు వేతనాలపై చట్టం రావాలి
- ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపుపై త్వరలో నిర్ణయం
- ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు సభలో చర్చించాలి

అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చున్నారు.

పేజి 2లో ▶

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్
# సి.రాజేష్ పుష్కర్ భేటీ

**ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి**



అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు.

2 లో

# సాంకేతిక సమస్య..

**నీట్ పీజీ అభ్యర్థులకు తప్పుడు మెసేజ్**




2లో

# బీసీ మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి ప్రభుత్వం శ్రీకారం

నేడు ఆగస్టు 13 గురువారం సచివాలయంలో బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్



2లో

## కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడివో చెప్పాలి: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: నగరంలో భూ కేటాయింపుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. భూ కేటాయింపులపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు.

పేజి 2లో ▶

- రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడివి?: మంత్రి శ్రీధర్‌బాబు
- గతంలో ఎకరా రూ.90 లక్షలకే కేటాయింపు
- తమ ప్రభుత్వం ఎకరాకు రూ.1.50 కోట్లు చొప్పున కేటాయింపు
- 5 ఎకరాల భూమికి రూ.7.5 కోట్లు మాత్రమే
- అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దు
- హెల్త్ పాలసీతో హైదరాబాద్‌కు ప్రయోజనం
- పారిశ్రామికవేత్తలను భయపెట్టడం సరికాదు
- తెలంగాణ నీటి వాటాలపై రాజీ లేదు

## ఎస్టీ కార్పొరేషన్ నిధులు పక్కదారి..



2లో

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
13-08-2026

# సంపాదకీయం

## మోదీ ఘటనా ఘటన సమర్థత ఏమైంది?

జూలై 20న దేశ రాజధానిలో విద్యార్థులపై పోలీసులు రకరకాల ఆయుధాలతో జరిపిన దాడులు సృష్టించిన గాయాల నుంచి చాలా మంది కోలుకునే ఉంటారు. అయితే అప్పటి నుంచీ పార్లమెంటు సమావేశాలు మాత్రం దాదాపు స్తంభించిపోయాయి. విద్యార్థులపై పోలీసు దాడులకు ఆదేశాలు ఎవరు జారీ చేశారో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు.

ఒకవైపు దేశ రాజధానిలో గత కొద్ది రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు ప్రజాజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుండగా మరో వైపు పార్లమెంటులో నినాదాలు రాజకీయ వాతావరణాన్ని స్తంభింపచేస్తున్నాయి. 'పేపర్ చోర్, గద్దీ ఛోడ్' అని నిన్నటివరకూ నినదించిన ప్రతిపక్షాలు ఇప్పుడు 'అమిత్ షా జవాబ్ దో, చందాచోర్, గద్దీ ఛోడ్' అని అని నినాదాలు చేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మంగళవారం మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీతో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య పార్లమెంటు భద్రతా సిబ్బంది గోడలా నిలుచోవలసి వచ్చింది. ఈ రణగొణ ధ్వనుల మధ్య కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన వార్తలు కూడా కొట్టుకుపోయినట్లు కనిపిస్తోంది.

వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నవారు, మోదీ సర్కార్ అనుకున్న విధంగా డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా చేయగలుగుతుందని భావించినవారు ఇప్పుడు నిరాశ చెందే ఉంటారు. ఈ బిల్లులను ఆమోదింపచేసేందుకు నరేంద్రమోదీ టీమ్ రంగం సిద్ధం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెచ్చిపోయిన ఉత్సాహంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఆయన మద్దతుదారులు ఉప్పొంగిపోయారు. మోదీకి దాసోహమై, ఆయన చర్యలకు భయభ్రాంతులై ఉన్న అనేక రాజకీయ పార్టీలు ఈ దేశంలో ఇక ఆయనకు తిరుగులేదని, ఆయన అడుగుజాడలను అనుసరించడం మినహా చేయగలిగేదేమీ లేదనే నిర్ధారణకు వచ్చారు.

నిజానికి గత రెండేళ్ల నుంచీ అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్యలు విదేశీ విధానం విషయంలో మోదీని ఆత్మరక్షణలో పడవేస్తున్నాయి. గత రెండు నెలలుగా దేశ వ్యవహారాలలో సంభవించిన అనేక పరిణామాలు ఆయన కల్పించిన భయోపేత వాతావరణాన్ని తుత్తునియలు చేశాయి. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, పిల్లలు మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం మోదీ అజేయశక్తిని మొట్టమొదటసారి దెబ్బతీసింది. ఈ ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం దేన్నైనా లెక్కచేయని తత్వాన్ని మార్చుకునేలా చేసింది. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. రైతు ఉద్యమం మాదిరే ఈ ఉద్యమాన్ని కూడా అణిచివేస్తే సద్దుమణిగి పోతుందనుకున్నవారు కింకర్తవ్య విమూఢులయ్యారు. పరాన్న జీవులు, బొద్దింకలు అని విమర్శించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విద్యార్థుల కేసులు వినడం ప్రారంభించారు. తొలుత అతుల్ లిమాయే వంటి ఆర్ఎస్ఎస్ నేతలు విద్యార్థుల ఆందోళనను దేశద్రోహం క్రింద అభివర్ణించినా ఆ తర్వాత మోహన్ భాగవత్ ఆలస్యంగానైనా స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని సరిగా అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. 'పక్షులకు కూడా పాడిచే హక్కు ఉంది' అని ఆయన తాజాగా ప్రకటించారు. 'మనం వారి మాట వినాలి. వారితో మనం మాట్లాడలేకపోయాం. అందుకే వారు నిరసన తెలిపారు.' అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా యువతను మెప్పించే విధంగా ఇన్‌స్టాగ్రామ్‌లు, రీల్స్ చేయడం మొదలుపెట్టారు. మంత్రులు సైతం విద్యార్థుల పరిభాషలో డెలులూ, ఫోమో అంటూ మాట్లాడసాగారు. ఈ నెల 8న ఢిల్లీ ఐఐటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధానమంత్రి ఆలోచన లేకుండా తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించాలని, నిజమైన పరిష్కారాల కోసం ధైర్యం ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చేసింది అదే కదా! వారే కనుక ప్రశ్నించే ధైర్యం చేయకపోతే ప్రశ్న పత్రాల లీక్‌పై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టేందుకు ఆగమేఘాలపై బిల్లును ప్రవేశపెట్టేవారే కాదు. ఈ నెలరోజుల సమావేశాల్లో పార్లమెంటులో చెప్పుకోదగినదేమైనా ఉన్నదంటే ఈ బిల్లు ఆమోదం పొందడం మాత్రమే.

మన సనాతన ధర్మంలో ప్రశ్నకు అత్యంత విలువైన స్థానం ఉన్నదని బీజేపీ సిద్ధాంతకర్తలకు వేరే చెప్పనక్కర్లేదు. భగవద్గీత, ఉపనిషత్తులు ప్రశ్నకు ప్రాధాన్యమిచ్చాయి. సత్యాన్ని అన్వేషించే క్రమంలో ప్రశ్నించే స్వేచ్ఛకు, అన్వేషణకు ఇచ్చిన విలువ మన సంస్కృతిలో మరి దేనికీ లేదు. తాము తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అనైతిక పనులు, తాము కుప్పకూల్చిన వ్యవస్థలు, అవినీతి కార్యకలాపాలను ప్రశ్నించాలంటే భయపడే పరిస్థితి ఇంతకాలం ఎదురయింది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితిలో కొద్దిగా మార్పు వస్తున్నట్లు కనపడుతోంది.

విద్యార్థుల ఆందోళన సద్దుమణిగిందో, లేక కొత్త ప్రాంతాల్లో తలెత్తుతుందో, లేక ఇతరేతర శక్తులకు ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పలేము కాని మోదీ విజృంభణ వల్ల దెబ్బతిన్న ప్రతిపక్షాలకు మాత్రం ఎక్కడలేని ఉత్సాహాన్ని కల్పించింది. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ఘన విజయం, ఇండియా కూటమి పార్టీల్లో చీలిక, విభేదాల వల్ల దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రతిపక్షాలు ఊపిరి పీల్చుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్‌గాంధీ నిర్వహించిన 'ఛాత్రోంకి ఘూంజ్'కు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడం కీలక పరిణామంగా భావించవచ్చు.

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ

మొదటిపేజీ తరువాయి

అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని

లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకు?

మొదటిపేజీ తరువాయి

సాయంత్రం పూట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను ప్రదర్శిస్తామన్నారు.

వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదని.. అలాంటి వారికి జీతాలు ఎందుకు ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకాకపోవడమేంటన్నారు. సభకు రాని వారికి వేతనాలు ఇవ్వకూడదని.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరిగి చట్టం తీసుకురావాలని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు.

"సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకున్నారు?కొందరు సభ్యుల దొంగ సంతకాలను అరికట్టేందుకే ఫేస్ రికగ్నిషన్ పెట్టాం. 6 నెలల పాటు సభకు రాకుంటే అనర్హత వేటు వేసే అంశం చర్చల స్థాయిలో ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో చూస్తున్నాం. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపుపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం" అని అయ్యన్న తెలిపారు.

## వైసిపి హయాంలో గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు

మొదటిపేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం డీఎస్సీలో ఎటువంటి తప్పులూ చేయలేదని, అంతా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. డీఎస్సీపై వైసీపీ శాసనమండలిలో లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని, ఆధారాలతో సహా నిరూపిద్దామని మంత్రులకు సూచించారు. తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అగ్రెసివ్‌గా ముందుకు వెళదామని, వైసీపీ నేతలను అసెంబ్లీకి రమ్మని సవాల్ చేయాలన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట డ్రామాలాడితే ప్రజలు నమ్మరని చెప్పుకొచ్చారు. రాని, అర్హత లేని ప్రతిపక్ష హోదాను ఎవరిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా.. 23 మంది ఉంటే నలుగురిని లాగేస్తే ప్రతిపక్షహోదా టీడీపీకి పోతుందని జగన్ చెప్పారని, ఇప్పుడు ఆ మాటలను మరిచిపోయారని మంత్రులు తెలిపారు. సోషల్ మీడియాలో ఆనాటి జగన్ మాటలు నేటికీ చక్కర్లు కొడుతున్నాయని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై శాసనమండలిలో దుమ్ముదులుపుతామని మంత్రులు అన్నారు. ఈ సందర్భంగా సిట్ నివేదికను తెలుగులోకి అనువదించి మరీ మంత్రులకు సీఎంవో అధికారులు వివరించారు.

## ఎస్టీ కార్పొరేషన్ నిధులు పక్కదారి..

మొదటిపేజీ తరువాయి

సిద్దిపేటలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ౧×జజ× ఆధ్వర్యంలో జరిగిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు, సిద్దిపేట చాప్టర్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగాలు వెతుక్కునే స్థాయి నుంచి.. పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా గిరిజన యువతను మార్చాలనే గొప్ప లక్ష్యంతో 'టిక్కీ' పని చేస్తోందని ఆయన అభినందించారు. గిరిజన బిడ్డలు సబ్సిడీలను ఎలా అందుకోవాలి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ఎలా వినియోగించుకోవాలో టిక్కీ ప్రతినిధులు ఒక మార్గదర్శిగా ఉంటూ దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు.

### ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ...

గిరిజన యువత వ్యాపార రంగంలో ఎదగడానికి ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ చాలా ముఖ్యం. కష్టపడితే ఎవరైనా విజయాలు సాధించవచ్చు. అని పేర్కొన్నారు నిజామాబాద్ జిల్లా గవర్నమెంట్ స్కూల్ లో చదివిన రమేష్ నాయక్ అనే గిరిజన బిడ్డ లండన్ లో 16 హోటళ్లు స్థాపించి గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగాడనీ తెలిపారు బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీ ప్రైడ్ ద్వారా సహకారం అందుకున్న సురేష్ నాయక్ అనే మరో గిరిజన బిడ్డ హైదరాబాద్ లో హార్లిక్స్ బర్త్ డే కేకులు తయారుచేస్తూ పెద్ద కంపెనీలతో పోటీపడుతున్నాడు. ఇలాంటి స్ఫూర్తిదాయక కథల నుంచి యువత నేర్చుకోవాలి.ఒకప్పుడు కేసీఆర్ గారి నాయకత్వంలో గిరిజన అభివృద్ధి కోసం వందల కోట్ల సబ్సిడీలు ఇస్తూ యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేశాం. అని గుర్తు చేశారు దేశంలో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారి గిరిజన మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. ఎన్నో గురుకులాలు నిర్మించి నాణ్యమైన విద్యను అందించాం.తెలంగాణ ఏర్పడ్డాక గిరిజనులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచాం. అని దీనివల్ల ఎంతో మంది గిరిజన బిడ్డలు నేడు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు.రాష్ట్రంలోని 3,300 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, గిరిజన బిడ్డలను సర్పంచులుగా చేసి వాళ్లకు రాజ్యాధికారాన్ని అందించాం. అని అన్నారు జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధులు ఆ సంవత్సరం ఖర్చు కాకపోతే, అవి ల్యాప్స్ కాకుండా మరుసటి ఏడాదికి క్యారీ ఫార్వర్డ్ అయ్యేలా ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని తెచ్చి పక్కాగా అమలు చేశాం. 6 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులను రైతులుగా మార్చాం. అని పేర్కొన్నారు కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తోంది. మేనిఫెస్టోలో ఎన్నో చెప్పారు.. పదో తరగతి పాస్ అయితే రూ.10 వేలు, పీజీ చేస్తే రూ.2 లక్షలు అన్నారు.. కానీ ఏ ఒక్కటి అమలు కాలేదు.మొన్న అసెంబ్లీలో మేం ప్రశ్నిస్తే.. ఎస్టీ కార్పొరేషన్ కు రూ.2,730 కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెప్పిందన్నారు కానీ ఖర్చు పెట్టింది కేవలం రూ.70 కోట్లు మాత్రమే. ఆ డబ్బులు కరెంట్ బిల్లులకు, ఫ్యాన్లకు, కార్లకు సరిపోయాయి. ఒక్క గిరిజన బిడ్డకు కూడా ఉపాధి కల్పించలేదు.ఎస్సీ, ఎస్టీ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇవాళ లక్ష ఎకరాల అసైన్డ్ భూములను గుంజుకుని పేదలను రోడ్డున పడేశారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు లగచర్లలో భూములు ఇవ్వబోమని అడిగిన పాపానికి లంబాడీ బిడ్డలను జైల్లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. గిరిజనుల భూములను లాక్కుని ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డికి, అల్లుడు సత్యకు కట్టబెట్టుకుంటున్నారనీ మండిపడ్డారు ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులు బడ్జెట్ లో పెడుతున్నారు కానీ, ఖర్చు మాత్రం సగం కూడా కావడం లేదు. యువతకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్నారు కానీ ఎక్కడా ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవు.యువతకు అన్యాయం జరుగుతున్న ఈ పరిస్థితుల్లో టిక్కీ (౧×జజ×) లాంటి సంస్థలు కేవలం సహకారం అందించడమే కాకుండా, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఒక ప్రెజర్ గ్రూప్ గా కూడా పనిచేయాలనీ తెలిపారు పెండింగ్ లో ఉన్న సబ్సిడీలను రాబట్టడానికి కృషి చేయాలి. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా మేం గిరిజనుల పక్షాన పోరాడుతాం. అని సిద్దిపేట జిల్లాలోని ఎస్టీ యువతీ యువకులు టిక్కీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో సభ్యులుగా చేరి, నైపుణ్యాలు పెంచుకుని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు

## బీసీ మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయడం ఈ పథకం ప్రత్యేకత. అని తెలిపారు ఆగస్టు 13, 2026 గురువారం మధ్యాహ్నం 12:00 గంటలకు హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని జీ-29లో ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.కుట్టు వృత్తిపై నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంచి

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

మొదటిపేజీ తరువాయి

**ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ**

భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

## పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం..

మొదటిపేజీ తరువాయి

పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

అధికార, ప్రతిపక్షాలపోటాపోటీ

చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో "కనిపించడం లేదు", "పారిపోయారు" వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ(ఝుష్ట్రబశ్రీ +ఘఅనష్త్రఱ)ని ఉద్దేశించి సవాల్ చేశారు.

## సాంకేతిక సమస్య..

### నీట్ పీజీ అభ్యర్థులకు తప్పుడు మెసేజ్

మొదటిపేజీ తరువాయి

నీట్ పీజీ 2026 (చీజుజు-=ూ+ 2026) ప్రవేశ పరీక్షకు హాజరయ్యే కొందరు అభ్యర్థులకు సెంటర్ వివరాలు తప్పుగా వెళ్లాయి. సాంకేతిక సమస్య కారణంగా ఈ పొరపాటు జరిగినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (చీదీజుమీూ) బుధవారం స్పష్టం చేసింది. సరైన సెంటర్ వివరాలతో అభ్యర్థులకు మళ్లీ ఎస్ఎంఎస్, ఈ మెయిళ్లు పంపినట్లు పేర్కొంది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష సెంటర్లను ఎన్‌బీఈఎంఎస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు బోర్డు తెలిపింది. గతంలో వచ్చిన ఎస్ఎంఎస్‌ను పరిగణనలోకి తీసుకోకుండా అధికారిక పోర్టల్‌లో వివరాలను సరిచూసుకోవాలని స్పష్టం చేసింది. నకిలీ వెబ్‌సైట్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని సూచించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30న పరీక్ష నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

**మార్పులకు ఆగస్టు 15 వరకు అవకాశం..**

నీట్ పీజీ 2026 దరఖాస్తుల్లో ఫొటో, సంతకం, వేలి ముద్ర నిబంధనలకు అనుగుణంగా లేని అభ్యర్థులకు ఎన్‌బీఈఎంఎస్ (చీదీజుమీూ) చివరి అవకాశం ఇచ్చింది. ఆగస్టు 15 రాత్రి 11.55 గంటల వరకు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ గడువులోగా తప్పులను సరిచేయకపోతే దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉందని బోర్డు స్పష్టం చేసింది. అభ్యర్థులు ఎన్‌బీఈఎంఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో తమ వివరాలతో లాగిన్ అయి.. అప్‌లోడ్ చేసిన ఫొటో, సంతకం, బొటనవేలి ముద్ర ఆమోదం పొందాయో లేదో చూసుకోవాలని పేర్కొంది. నిబంధనలకు సరిపోని వాటిని గడువులోగా సరిచేయాలని తెలిపింది. పరీక్షతో పాటు కౌన్సెలింగ్, ప్రవేశ ప్రక్రియ పూర్తయ్యే వరకు దరఖాస్తులో ఇచ్చిన ఈమెయిల్, మొబైల్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని బోర్డు సూచించింది. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వాటి ద్వారా పంపే అవకాశం ఉన్నందున అభ్యర్థులు తరచూ పరిశీలించుకోవాలని పేర్కొంది.

## కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడివో చెప్పాలి: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి

ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

# వేములవాడలో ఉచిత వైద్య శిబిరం.. రైతుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

- రైతులకు మెడికవర్ ఉచిత వైద్య సేవలు.. ప్యాక్స్ ఛైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి అభినందనలు
- ప్యాక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం
- రైతుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అభినందనీయం: ప్యాక్స్ ఛైర్మన్ తిరుపతి రెడ్డి



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 12

అహర్నిశలు కష్టపడి సమాజానికి అన్నం పెట్టే రైతుల ఆరోగ్య పరిరక్షణే ముఖ్య లక్ష్యంగా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వేములవాడ స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) ప్రాంగణంలో బుధవారం ఈ ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్యాక్స్ ఛైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్యాక్స్ ఛైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. రోజంతా పొలాల్లో చెమటోడ్చి పనిచేసే రైతులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమన్నారు. గ్రామీణ ప్రాంత రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య సలహాలు అందించేందుకు ముందుకు వచ్చిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యాన్ని, వైద్యులను, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రైతుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భవిష్యత్తులోనూ రైతుల శ్రేయస్సును కాపాడేలా మరిన్ని ఉచిత వైద్య, సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

**ఉచితంగా బీపీ, షుగర్ ఈసీజీ పరీక్షలు, ఔషధాల పంపిణీ**

శిబిరంలో పాల్గొన్న రైతులకు మెడికవర్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం బిపి, షుగర్, ఈసీజీతో పాటు పలు రకాల సాధారణ ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించింది. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దైనందిన జీవితంలో పాటించాల్సిన ఆరోగ్య సూచనలను వైద్యులు వివరంగా తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ పవన్ కుమార్, ప్యాక్స్ ఉపాధ్యక్షుడు కాంతారావు, సొసైటీ డైరెక్టర్లు దొంతగొని రాజయ్య, అమృత, మాజీ డైరెక్టర్ గుడిసె సదానందంలతో పాటు సొసైటీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## ధర్మారం జడ్పీ పాఠశాలలో కన్నులపండువగా బోనాల వేడుకలు

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 12





కొనరావుపేట మండలంలోని ధర్మారం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం (ఆగస్టు 12) బోనాల సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని గ్రామదేవత పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. తమకు మంచి విద్య, జ్ఞానం, సదాచారాలను ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల వేడుక అనంతరం పాఠశాలలో ప్రత్యేకంగా 'ఫుడ్ ఫెస్టివల్' నిర్వహించారు. విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చిన వివిధ రకాల సంప్రదాయ వంటకాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ, వివిధ ఆహార సంస్కృతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాలుగోసారీ ఆడపిల్లేనని... ఆసుపత్రి ఆవరణలోనే బాలింత ఆత్మహత్య

- అత్తింటి వేధింపులతో బాలింత బలవన్మరణం



నల్గొండ జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 12

నల్గొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఒక బాలింత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన మమత అనే మహిళకు వారం రోజుల క్రితం ప్రసవం జరగ్గా, ఆమె నాలుగోసారి కూడా ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఇదివరకే ముగ్గురు కుమార్తెలు ఉండగా, మళ్లీ ఆడసంతానమే కలగడంతో అత్తింటివారి నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. మగపిల్లాడు పుట్టలేదనే నెపంతో కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతుండటంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో బుధవారం ఆసుపత్రి ఆవరణలోని ఓ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మమత మృతికి అత్తింటివారి వేధింపులే కారణమని బాధితురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆది శ్రీనివాస్‌పై బురదజల్లొద్దు: మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు

- వేములవాడ అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ విమర్శలు
- రాజన్న ఆలయానికి బండి సంజయ్ ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి
- ఎమ్మెల్యే చొరవతో వేములవాడకు రూ.400 కోట్ల నిధులు
- హిందూ మతాన్ని అడ్డుపెట్టుకుని గెలిచింది బీజేపీ నేతలే: కాంగ్రెస్ నాయకులు
- 30 ఏళ్లలో జరగని అభివృద్ధి మూడేళ్లలో జరుగుతోంది: కాంగ్రెస్ నేతల వెల్లడి
- వేములవాడలో మీడియా సమావేశం.. పాల్గొన్న రొండి రాజు, తుం మధు, కనికరపు రాకేష్, నరాల శేఖర్ తదితరులు..



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 12

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తుం మధు మాట్లాడారు. హిందూ మతాన్ని అడ్డుపెట్టుకుని గెలిచిన బీజేపీ నాయకులు తమ స్థాయి మరచి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దేవుని పేరుతో వందల కోట్లు దండుకున్నది బీజేపీ నేతలేనని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజన్న ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ పట్టణాభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. ఆలయ సమగ్ర అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులతో పట్టణ రూపురేఖలు మారుతున్నాయని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మౌలిక వసతుల కల్పనకు సలహాలు ఇవ్వాల్సింది పోయి, అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదన్నారు. ముప్పై ఏళ్లుగా జరగని అభివృద్ధి మూడేళ్లలో జరుగుతుంటే బీజేపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్‌తో పాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ భూముల కోసం మొదలైన సర్వే.. 2009 ఎకరాల భూమి కావాలె !




ఆదిలాబాద్ జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 12

ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు భూ సేకరణ కోసం మంగళవారం అధికారికంగా భూ సర్వే ప్రారంభమైంది. ఎయిర్ పోర్టుకు అవసరమైన భూముల సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.2,278 కోట్లు మంజూరు చేసింది. 2,009 ఎకరాల భూమి సేకరించనుండగా, అందుకు సంబంధించి సర్వే బృందాలు సర్వే చేపట్టాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బలగాల మధ్య అనుకుంట గ్రామ శివారులోని సర్వే నంబర్ 16 నుంచి 31 వరకు అధికారులు సర్వే నిర్వహించారు. ఏ ప్రాంతం వరకు భూములు అవసరం ఉన్నాయనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని భూముల కొలతలు తీసుకున్నారు. సర్వే చేస్తున్నప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలు సహకరించాలని కోరారు. మొత్తం మూడు బృందాలు సర్వే చేయగా, ఆదిలాబాద్, నిజామాబాద్ కు చెందిన సర్వేయర్లు పాల్గొన్నారు. కాగా భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

# నూకలమర్రిలో గుగులోతు కిషన్ కుటుంబానికి సాయం అందించిన కాంగ్రెస్ నేతలు

- అనారోగ్యంతో కార్యకర్త మృతి.. కన్నీటి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు
- ఆది శ్రీనివాస్ సహకారంతో కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- కాంగ్రెస్ నేతలు వకుళభరణం శ్రీనివాస్, రొమాల ప్రవీణ్ భరోసా





వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 12

వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గుగులోతు కిషన్ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ తరఫున బుధవారం రూ. 6,500 ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ నాయకులు మృతుని నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత వకుళాభరణం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ మాట్లాడుతూ... నిరుపేద కుటుంబానికి చెందిన గూగులోతు కిషన్ అకాల మరణం చెందడం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలు గుర్తుండిపోతాయని, కార్యకర్తల కుటుంబాలకు వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబానికి భవిష్యత్తులోనూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ పాలకుర్తి శంకరయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు సామల్ల రాజు, వార్డు సభ్యులు కొమ్ము రణధీర్, రాజ్ నాయక్, సుల్తాన్ పరశురాములు, నాయకులు తిరుపతి, సుమిత్, రమేష్, రోమాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చందుర్తిలో కన్నులపండువగా 'హర్ ఘర్ తిరంగా'

**- దేశ సమైక్యతకు త్రివర్ణ పతాకమే ప్రతీక: బీజేపీ మండల అధ్యక్షుడు విజేందర్**

చందుర్తి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 12

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు చేపట్టిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా చందుర్తి మండల కేంద్రంలో బుధవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతిలో జాతీయ జెండాలను పట్టుకుని, 'భారత్ మాతాకీ జై', 'జైహింద్' అంటూ చేసిన నినాదాలతో చందుర్తి వీధులు దేశభక్తి భావంతో మార్మోగాయి. ఈ సందర్భంగా మొకిలే విజేందర్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత, సార్వభౌమత్వం, దేశభక్తి భావాలు ప్రజల్లో మరింత బలపడతాయని తెలిపారు. నేటి యువత స్వాతంత్ర్య సమరయోధుల ఆదర్శాలను తెలుసుకుని, "దేశం ముందు -- మనం తరువాత" అనే స్ఫూర్తితో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మార్తా సత్తయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోచిట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు, సీనియర్ నాయకులు చిలుమల హనుమయ్యచారి, చింతకుంట గంగాధర్,




మండల ఉపాధ్యక్షులు మట్క మల్లేశం, యువమోర్చా మండల అధ్యక్షుడు మోత్కుపల్లి రాజశేఖర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చింతకుంట సాగర్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు పాటి సుధాకర్, మండల కార్యదర్శి ఎగులపు గణేష్, నాయకులు మేడిశెట్టి శ్రీహరి, తీపిరెడ్డి మనోహర్ రెడ్డి, బోరగయ తిరుపతి, తోట శంకర్, పెరుక రంజిత్, జలగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు క్రీడల కిట్లను అందించిన

**- చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు దంపతులు**

ముస్తాబాద్/ ఆగస్టు12 ప్రజా దివాస్





రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పిల్లలకు కు గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు గారు 4 వాలీబాల్ 4 ఫుట్బాల్ 2 క్రికెట్ కిట్లు 2 వాలీబాల్ నెట్ హెల్మెట్స్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముస్తాబాద్ మండల ఎస్సై జ్యోతి సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజి రెడ్డి సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భూంపల్లి సురేందర్ రావు పార్టీ పట్టణ అధ్యక్షులు ఎదగంటి నరసింహారెడ్డి మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీనివాస్ గౌడ్ కరుణాకర్ పరిధి పేట వెంకటేష్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు గూడెం గ్రామానికి చెందిన చిట్నేనిమాధవి వెంకటేశ్వరరావు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొమ్మెట రాజమల్లు తెలపడంతోనే మంచి మనసుతో వాలీబాల్ ఫుట్బాల్ క్రికెట్ కిట్స్ వాలీబాల్ హెల్మెట్స్ ఇవ్వడం జరిగింది వారికి ప్రత్యేక ధన్యవాదాలు

# తప్పుడు సమాచారంతో పొందిన భవన అనుమతులపై మున్సిపాలిటీ కఠిన చర్యలు

**- జగిత్యాల బస్‌స్టాండ్ ప్రాంతంలో రెండు అనుమతులు రద్దు**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 12

తప్పుడు సమాచారం, అసత్య పత్రాల ఆధారంగా పొందిన భవన అనుమతులపై వేములవాడ మున్సిపాలిటీ కఠిన చర్యలు చేపట్టింది. జగిత్యాల బస్‌స్టాండ్ గెజిట్ ప్రాంతం (సర్వే నంబర్ 853)లో మంజూరైన రెండు భవన అనుమతులను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బుధవారం వెల్లడించారు. అధికారుల పరిశీలనలో చందుర్తి, రాజన్న సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన ఇద్దరు దరఖాస్తుదారులు సమర్పించిన స్థల పత్రాలు, దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలు మరియు అనుమతులు పొందిన ప్రదేశాల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు తేలింది. దీనిని తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించిన మున్సిపల్ అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (పిూడఖణ) శాఖ మార్గదర్శకాల మేరకు



సంబంధిత దరఖాస్తుదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. అయితే నిర్ణీత గడువులోగా ఎలాంటి సమాధానం లేదా సరైన ఆధారాలు సమర్పించకపోవడంతో తెలంగాణ మున్సిపాలిటీల చట్టం--2019లోని సెక్షన్ 176(9) ప్రకారం ఆ రెండు భవన అనుమతులను ఆగస్టు 12న రద్దు చేసినట్లు కమిషనర్ తెలిపారు. అనుమతుల కోసం చెల్లించిన ఫీజును మున్సిపాలిటీ ఖాతాలోనే నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**ప్రజలకు హెచ్చరిక**

భవన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో స్థల యాజమాన్య పత్రాలు, సర్వే నంబర్లు, ఇతర వివరాలను పూర్తిగా సరిచూసుకుని సమర్పించాలని కమిషనర్ సూచించారు. తప్పుడు సమాచారం అందించి అనుమతులు పొందే ప్రయత్నాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ముఖ్యాంశాలు**

- తప్పుడు సమాచారంతో పొందిన రెండు భవన అనుమతుల రద్దు
- జగిత్యాల బస్‌స్టాండ్ గెజిట్ ప్రాంతంలో ఘటన
- దరఖాస్తుల్లో స్థల వివరాలపై తీవ్ర వ్యత్యాసాలు గుర్తింపు
- షోకాజ్ నోటీసులకు స్పందించని దరఖాస్తుదారులు
- తెలంగాణ మున్సిపాలిటీల చట్టం--2019 సెక్షన్ 176(9) కింద చర్యలు
- భవిష్యత్తులో కఠిన తనిఖీలు నిర్వహిస్తామని మున్సిపాలిటీ స్పష్టం

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 12

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. ఈ నెల 15న జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ, వేడుకల నిర్వహణకు అవసరమైన డయాస్ ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం అతిథుల సీటింగ్, నాణ్యమైన సౌండ్ సిస్టం, తగిన సంఖ్యలో కుర్చీలు, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో సిరిసిల్ల శ్రీధర్ బాబు, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంపై అపోహలకు చెక్..!

**- గర్భాలయం, మహామండపం యథాతథం శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో అభివృద్ధి పనులు వేగవంతం**

**- దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్ర నిబంధనలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగానే కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 12

ఆలయ అభివృద్ధి పనులపై నెలకొన్న సందేహాలకు తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ అర్చకులు, ధార్మిక సలహాదారులతో కలిసి శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామి వారిని కలిసి పూర్తి వివరాలు అందజేశారు.

**గర్భాలయం, మహామండపంపై స్పష్టత**

గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా, కొన్ని వర్గాల ద్వారా గర్భాలయం, మహామండపాన్ని తొలగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. "గర్భాలయం, మహామండపాన్ని ముట్టే ప్రసక్తే లేదు. అవి యథాతథంగానే ఉంటాయి" అని ఆయన పేర్కొన్నారు.

**రూ.250 కోట్లతో రాజన్న క్షేత్రానికి మహా రూపకల్పన**

రాజన్న ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు రూ.250 కోట్ల నిధులు



కేటాయించగా, పనులు దాదాపు 55 శాతం పూర్తయ్యాయి. గతంలో రూ.50 కోట్లు, అనంతరం రూ.100 కోట్లు, తాజాగా రూ.99.40 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు వెల్లడించారు.

**శిఖరానికి శిలామయ వైభవం**

1973లో నిర్మించిన ప్రస్తుత శిఖరాన్ని మరింత వైభవంగా, భవిష్యత్తులో బంగారు తాపడం చేసుకునేలా శిలామయ నిర్మాణంగా తీర్చిదిద్దే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. శిఖరాన్ని సుమారు నాలుగు అడుగుల మేర పెంచి ఆగమ శాస్త్రానికి అనుగుణంగా నిర్మించాలని శృంగేరి పీఠాధిపతులు సూచించినట్లు వెల్లడించారు.

**భక్తుల సౌకర్యాలే లక్ష్యం**

ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆధునిక సదుపాయాలతో అనివెట్టి మండపం నిర్మాణం కొనసాగుతోందన్నారు. భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**శృంగేరి పీఠాధిపతుల హర్షం**

ఆలయ అభివృద్ధి నమూనాలు, నిర్మాణ ప్రణాళికలను పరిశీలించిన శృంగేరి పీఠాధిపతులు పనులు శుభప్రదంగా ఉన్నాయని



అభినందించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

**దేవాదాయ కమిషనర్ హనుమంతరావు**

ఆలయ అభివృద్ధిలో గర్భాలయ విస్తరణ, మార్పులు, మహామండపం తొలగింపు వంటి ప్రతిపాదనలు ఏవీ లేవని దేవాదాయ కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. శృంగేరి పీఠం నుంచి అందనున్న శ్రీముఖం, సూచనల మేరకు తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

**అర్చకుల భరోసా**

ఉప ప్రధాన అర్చకులు శరత్ శర్మ, ఇంచార్జీ స్థానాచార్యులు ఉమేష్ శర్మ మాట్లాడుతూ, మూలవిరాట్టు, గర్భాలయ పవిత్రతకు ఎలాంటి భంగం కలగకుండా అభివృద్ధి పనులు కొనసాగుతాయని భక్తులకు భరోసా ఇచ్చారు.

**భక్తులకు విజ్ఞప్తి**

రాజన్న ఆలయ అభివృద్ధిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఆగమ శాస్త్రం, సనాతన సంప్రదాయాలు, శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శకత్వంలోనే ప్రతి అడుగు ముందుకు వేస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. "రాజన్న వైభవం మరింత పెరుగుతుంది... గర్భాలయం, మహామండపం యథాతథంగానే ఉంటాయి" ఆది శ్రీనివాస్

# వట్టిమల్ల గొల్లపల్లిలో దారుణం.. పారాతో తలపై దాడి..

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 12



కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి లో దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్దగొల్ల సత్తయ్యపై అదే గ్రామానికి చెందిన సామల శ్రీనివాస్ పారాతో దాడి చేసినట్లు సమాచారం. ఒంటరిగా ఉన్న సత్తయ్యపై శ్రీనివాస్ దాడికి పాల్పడ్డట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పారాతో తలపై బలంగా కొట్టడంతో సత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దాడి నుంచి తప్పించుకున్న సత్తయ్య తీవ్ర గాయాలతో బైక్‌పై కోనరావుపేటకు చేరుకుని, అక్కడి నుంచి చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించరు. ఈ ఘటనపై సత్తయ్య కుటుంబ సభ్యులు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. గొల్లపల్లిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# కల్తీ పేరుతో కల్లుగీత వృత్తిపై దాడులు మానుకోవాలి..

-కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకై గౌడ కల్లుగీతన్నలు పోరాటాలకు సిద్ధం కావాలి

-ఎంవి రమణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజాదివాస్

కల్తీ కళ్ళు పేరుతో కల్లుగీత వృత్తిపై పథకం ప్రకారం చేస్తున్న దాడుల్ని తక్షణం నిలిపివేయాలి కల్లుగీత వృత్తిని ఆధునికరించి తాటి ఈత నీరా ఉప ఉత్పత్తులను ప్రోత్సహించాలి.గౌడ కల్లుగీత నిరుద్యోగ యువతకు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కృషి చేయాలని, 2023 ఎన్నికలలో కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాధిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షు లు ఎం.వి. రమణ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం పట్టణంలోని రేణుక ఫంక్షన్ హాల్ లో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సైదగోని వెంకట్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో యం.వి.రమణ మాట్లాడుతూ గీత కార్మికులకు పెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్స్గ్రేషియా 10 లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని.అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు. మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు. వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. నందనములోని నీరా ప్రాజెక్టు ను



వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమాని కి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో యాత్ర బృందం సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య గైని వెంకన్న బండ కింది అరుణ్ కుమార్ జిల్లా కార్యదర్శి డి.రాజా గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ గౌడ్ రమేష్ గౌడ్ స్వామి గౌడ్ రాజా గౌడ్ మోహన్ గౌడ్ శంకర్ గౌడ్ సాయ గౌడ్ బసవగౌడ్ కామారెడ్డి టౌన్ వన్ సొసైటీ అధ్యక్షులు బండారి రాజా గౌడ్ రామ్ చందర్ గౌడ్ శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# భూంపల్లి నేతాజీ యువజన సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..



ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలో నేతాజీ యువజన సంఘం 40వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడిగా రుస్తుం రమేష్, క్యాషియర్‌గా కోడలి పవన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, క్యాషియర్‌లకు సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రుస్తుం రమేష్, క్యాషియర్ కోడలి పవన్ మాట్లాడుతూ.. నేతాజీ యువజన సంఘం 40వ వార్షికోత్సవం సందర్భంగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, యువత సంక్షేమానికి, గ్రామంలో సామాజిక కార్యక్రమాల నిర్వహణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.నేతాజీ యువజన సంఘం ఆశయాలకు అనుగుణంగా సభ్యులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. గ్రామ యువతను ఐక్యంగా ఉంచుతూ సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం సభ్యులు, గ్రామ యువత, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 49 వార్డుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ కౌన్సిలర్ల వినతి..

ప్రజాదివాస్



కామారెడ్డి పట్టణంలోని 49 వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ పర్వతాలకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాల సమయంలో పలు ప్రాంతాల్లో మురుగు, వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వార్డుల వారీగా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు మౌలిక వసతులు అందేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ కౌన్సిలర్లు సమర్పించిన వినతిపత్రంపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ పర్వతాలు సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్లు తెలిపారు.

# ప్రజా సమస్యలే నా సమస్యలు 14వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ భూక్య ఉదయ్ జ్యోతి

- సొంత నిధులతో డ్రైనేజీ నిర్మాణం
- ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా మురుగు కాల్వ నిర్మాణం
- ప్రజా సమస్యలే నా సమస్యలు: 14వ వార్డు కౌన్సిలర్ డా.ఉదయ్ జ్యోతి

ప్రజాదివాస్



అశ్వారావుపేట మున్సిపాలిటీలోని 14వ వార్డులో చాలా కాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యకు కౌన్సిలర్ భూక్య ఉదయ్ జ్యోతి చొరవతో పరిష్కారం లభించింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.ఈ సమస్యను స్థానికులు కౌన్సిలర్ డా.భూక్య ఉదయ్ జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె ప్రభుత్వ నిధులు మంజూరయ్యే వరకు వేచి చూడకుండా తక్షణమే స్పందించారు. తన సొంత నిధులతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయించారు.డ్రైనేజీ నిర్మాణం పూర్తవడంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను తన సమస్యలుగా భావించి సొంత ఖర్చుతో పనులు చేపట్టడం పట్ల కౌన్సిలర్ ఉదయ్ జ్యోతిని వార్డు ప్రజలు అభినందిస్తున్నారు.“14వ వార్డు ప్రజల సమస్యలే నా సమస్యలు.. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ సమస్యనైనా నా వంతుగా పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటాను” అని కౌన్సిలర్ భూక్య ఉదయ్ జ్యోతి తెలిపారు.

# బోర్లం గురుకుల కళాశాలలో కలెక్టర్, ఎస్పీ ఆకస్మిక తనిఖీ..

- విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర
- నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు

ప్రజాదివాస్

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వారికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, జూనియర్ కళాశాల (బాలికల)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్యా బోధన, వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, చదువులో ఎదురవుతున్న ఇబ్బందులు, కళాశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థినులతో కలిసి భోజనం తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినులతో ఒకే చోట కూర్చొని భోజనం చేస్తూ వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత,



రుచి, మెనూ అమలు, పరిశుభ్రతపై స్వయంగా పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. భోజన తయారీ ప్రదేశం, వంట సామగ్రి, ఆహార పదార్థాల నిల్వ, పరిసరాల పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ మెనూ ప్రకారం భోజనం అందించాలని స్పష్టం చేశారు.తరగతి గదుల పరిశీలన కళాశాలలోని తరగతి గదులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. విద్యార్థినులతో ముచ్చటిస్తూ వారి చదువులు, విద్యా ప్రగతి, భవిష్యత్ లక్ష్యాలు, కళాశాలలో అందుతున్న విద్యా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో బోధనా విధానం, బ్లాక్‌బోర్డుపై రాసిన పాఠాలు, విద్యార్థుల విద్యా ప్రగతి తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం కళాశాలలోని రికార్డులు, నివేదికలు, విద్యార్థులు సాధించిన ట్రోఫీలు తదితరాలను పరిశీలించారు. అధ్యాపకులతో విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా పద్ధతులు, పరీక్షల ఫలితాలు, విద్యార్థుల ప్రతిభపై చర్చించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారికి ఉన్నత విద్యకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అధ్యాపకులకు సూచించారు.మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి కళాశాల ఆవరణ, విద్యార్థినుల వసతి సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, మెరుగైన వసతులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకొని తమకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు.జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర విద్యార్థినులతో మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థినుల భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీసీఓ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, గిర్దావర్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.

13

# ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన షబ్బీర్ అలీ..

-రెండు రోజుల్లో రోడ్డు మరమ్మతులు పూర్తి

ప్రజాదివాస్

కామారెడ్డి పట్టణ ప్రజల రాకపోకలకు కీలకమైన సిరిసిల్ల రోడ్డు నుంచి జాతీయ రహదారి-44 (ఎన్ హెచ్ -44)కు వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారి అధ్వానంగా మారడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్య ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారిని అత్యవసరంగా మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జాతీయ రహదారి-44 అధికారులతో మాట్లాడి అవసరమైన నిధులు కేటాయించి, ఆలస్యం లేకుండా మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.షబ్బీర్ అలీ ఆదేశాలతో అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతు పనులను ప్రారంభించారు. కేవలం రెండు రోజుల్లోనే పనులను పూర్తి చేసి రహదారిని ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.ప్రజల సమస్యను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌పై



కామారెడ్డి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై ఇదే విధంగా తక్షణమే స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# 'ఇరుముడి'.. శబరిమలతో సంబంధం లేదు: కథ చెప్పేసిన దర్శకుడు



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ ఫ్యామిలీ అండ్ డివోషనల్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా పాటల్లో, టీజర్‌లో రవితేజ అయ్యప్ప మాలలో కనిపించారు. దీంతో ఈ చిత్ర కథపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. శబరిమల బ్యాక్‌డ్రాప్‌లో ఇది రానుందని ప్రచారం మొదలైంది. తాజాగా దీనిపై దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. శబరిమల దేవాలయానికి ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు."ఈ కథకు శబరిమలతో ఎలాంటి సంబంధం లేదు. సినిమాలో కథానాయకుడి జీవితంలో 41 రోజుల అయ్యప్ప దీక్ష ఒక భాగం మాత్రమే. దీక్షా కాలంలో అయ్యప్ప భక్తులు తమ నియమావళి, అలవాట్ల విషయంలో చాలా నిష్టగా ఉంటారు. వ్యసనాలు ఉన్న ఒక వ్యక్తి ఈ దీక్ష తీసుకోవాల్సి వస్తే.. అతడు మద్యానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. అక్కడే కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. కఠినమైన నియమాలు ఉండాలి కాబట్టే నేను అయ్యప్ప స్వామి దీక్ష నేపథ్యాన్ని ఎంచుకున్నాను. అంతే తప్ప ఇది శబరిమలకు సంబంధించిన కథ కాదు" అని ఆయన పేర్కొన్నారు."ఈ 41 రోజుల కథే స్క్రీన్‌ప్లేకి ప్రధాన బలంగా నిలుస్తుంది. అది సినిమాను మరింత ఆసక్తికరంగా మారుస్తుంది. ఆ దీక్షకు ముందు ఏం జరిగింది.. దీక్షలో ఉన్న సమయంలో ఏం జరిగిందనే విషయాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి" అని శివ నిర్వాణ తెలిపారు. రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న ఈ సినిమా ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది



# ధనుష్ అభిమాన సంఘం నిర్ణయం.. తమిళనాట హాట్ టాపిక్

కోలీవుడ్ కథానాయకుడు ధనుష్ రాజకీయాల్లోకి రానున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఇటీవల తన అభిమానులకు పిలుపునివ్వడంతో ఈ ప్రచారం జోరందుకుంది.ఈ నేపథ్యంలో ధనుష్ అభిమాన సంఘం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 'ఆల్ ఇండియా ధనుష్ ఫ్యాన్స్ అసోసియేషన్'.. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా పరిధిలో ఐదు నియోజకవర్గాల్లో కొత్త సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఫ్యాన్ క్లబ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ధనుష్ సంక్షేమ సంఘం అఖిల భారత కార్యదర్శి బి. రాజా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ప్రకటన తమిళనాడు రాజకీయల్లో హాట్ టాపిక్‌గా మారింది.సాధారణంగా తమిళనాడు రాజకీయాల్లో అభిమాన సంఘాలు క్షేత్రస్థాయిలో ప్రధాన భూమిక పోషిస్తాయి. గతంలో విజయ్ వంటి నటులు కూడా తమ రాజకీయ ప్రయాణానికి ముందు అభిమాన సంఘాల ద్వారానే నియోజకవర్గాల వారీగా బలమైన కేడర్‌ను నిర్మించుకున్నారు. ఇప్పుడు ధనుష్ కూడా అదే తరహాలో నియోజకవర్గాల వారీగా సంక్షేమ సంఘాల విస్తరణకు ఆదేశాలు ఇవ్వడంతో ఆయన త్వరలోనే పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం ఖాయమని వార్తలు వైరల్ అవుతున్నాయి.



# కలల గాలిలో తేలియాడనీ నన్ను!

మలయాళ కథానాయకుడు నివిన్ పౌలీ, మమితా బైజు ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'బెత్లెహం కుడుంబ యూనిట్'. గిరీష్ ఏడీ దర్శకత్వం వహించారు. భావన స్టూడియోస్ సంస్థ నిర్మించింది. ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా 'ఇల్లే ఇల్లా' అనే పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "లేదు, లేదు, లేదు.. అది కళ్లలో లేదు, మాటల్లోనూ లేదు.. ఎక్కడా లేదు. నా కళ్లముందు పసుపు రంగులో ఏదో వికసించింది. ఒక చల్లని చిన్న అద్భుతం కలల గాలిలో నన్ను తేలియాడనీ.." అంటూ సాగుతున్న ఈ గీతం సినీప్రియుల్ని ఆకట్టుకుంటుంది. సుహైల్ కోయా సాహిత్యమందించిన ఈ గీతాన్ని కపిల్ కపిలన్ ఆలపించారు. రొమాంటిక్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# హాట్ టాపిక్‌గా మారిన 'టాక్సిక్' రన్‌టైమ్




ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం ఇక, ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. కన్నడ ఇండస్ట్రీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది కాగా.. రెండు ఐమాక్స్ చిత్రాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) తన ఖాతాలో వేసుకున్న ఏకైక కన్నడ స్టార్‌గా యశ్ రికార్డు సృష్టించారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఐమాక్స్ బుకింగ్స్ కూడా ప్రారంభం కానున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# తల్లిదండ్రుల్ని చూసుకోవడం కన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు: నాగార్జున



"అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించింది" అన్నారు అక్కినేని నాగార్జున. ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఇది ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్మాత నాగార్జున మాట్లాడుతూ.. "అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం" అన్నారు. "కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.



# పాన్ ఇండియాగా 'ఇంద్ర పుత్ర'

ఇటీవలే 'చెన్నై లవ్‌స్టోరీ'తో ప్రేక్షకుల్ని పలకరించారు కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన హీరోగా ఓ పాన్ ఇండియా సినిమాని ప్రకటించారు. 'ఇంద్రపుత్ర: ఫస్ట్ చాప్టర్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ.. "మన పురాణాల్లో ధర్మానికి.. అధర్మానికి మధ్య జరిగే పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇప్పటి ట్రెండ్‌కు తగిన మేకింగ్‌తో ఈ సినిమాని నిర్మిస్తున్నాం. దీనితో మేము ఓ సరికొత్త సినిమాటిక్ వరల్డ్‌ని సృష్టించబోతున్నాం. కిరణ్ ఇందులో ఓ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. భాషలకు అతీతంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా దీన్ని ముస్తాబు చేయనున్నాం. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్టోబరు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది" అన్నారు.